# జోనల్ వ్యవస్థ



**బి. భుజంగరావు**
అధ్యక్షులు

భారత రాజ్యాంగంలో వివిధ రాష్ట్రాలలో గల పరిస్థితులను అనుసరించి సమగ్ర వికాసంతో సమాన అవకాశాలు అందరికీ దక్కాలని బలహీన ప్రాంతాలను అనగా సామాజిక, ఆర్థిక, విద్యా ప్రగతిలో గల వ్యత్యాసాలతో వెనుకబడిన ప్రాంతాలుగా పేర్కొన్నవని గమనించాలి. ఇందుకు తగిన రక్షణ కలగాలంటే ఒక నిర్దిష్ట వ్యవస్థ ఏర్పడాలనే లక్ష్యంతో జోనల్ వ్యవస్థ రూపొందింది. ఈ రాష్ట్రంలో అయితే విభజనకు ముందున్న ఆంధ్రప్రదేశ్‌లో ఆరుజోన్లుగా విభజించబడి నియామకాలలో, పదోన్నతులలో ఆయా ప్రాంతాలకు, జిల్లాలకు తగిన రక్షణ కల్పించడము కోసం 371(D) అధికరణ క్రింద నిన్నటి వరకు కొనసాగుతున్నది ఈ జోనల్ వ్యవస్థ. రాయలసీమ, ఆంధ్రా ప్రాంతాలలో గల 13 జిల్లాలను 4 జోన్లు (1, 2, 3, 4) క్రింద వ్యవస్థీకరించడం జరిగింది. తెలంగాణ ప్రాంతానికి చెందిన పది జిల్లాలను 5, 6 జోన్లు (2 జోన్లు)లలో వ్యవస్థీకరించడం జరిగింది. ఇందుకు నేపథ్యం తెలంగాణ ప్రాంతానికి నియామకాలలో, పదోన్నతులలో సీమాంధ్ర ప్రాంతము వలన అన్యాయము జరుగుచున్నదని, ఇది అన్ని రంగాలలో అభ్యర్థులకు న్యాయం జరగడం లేదని, తీవ్ర ప్రతిఘటనల ఫలితంగా అందరికీ సమన్యాయం మరియు ఒక ప్రాంతం మరొక ప్రాంతాన్ని దోపిడీ చేయకుండా నిలువరించడమే లక్ష్యంగా జోనల్ వ్యవస్థ అనివార్యమై కొనసాగుతుండేది. తెలంగాణ ప్రాంతంలో గల పదిజిల్లాలు (హైదరాబాద్‌తో సహా) అన్ని రంగాలలో సమగ్రమైన వికాసం సమాన స్థాయిలో జరగలేదని గ్రహించిన స్థితిలో తెలంగాణ ప్రాంతాన్ని కూడా అభివృద్ధిలోని వ్యత్యాసాలను పరిగణలోకి తీసుకొని రెండు జోన్లుగాను, ఐదవ జోన్‌లో వరంగల్, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలు మరియు నల్గొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, మెదక్, నిజామాబాద్ మరియు హైదరాబాద్ జిల్లాలను ఆరవ జోన్‌లో ఉంచడం జరిగింది. పాఠశాల విద్యారంగానికి సంబంధించి హైదరాబాద్ జిల్లాను (City of Hyderabad Cadre) పేరుతో ప్రత్యేక జోన్‌గా గుర్తించడం జరిగింది. విద్యతోపాటు మరో 13 ఇతర రంగాల విభాగాలను హైదరాబాద్ ప్రత్యేక క్యాడర్ జోన్ క్రింద చేర్చడం జరిగింది. ఇదంతా జోనల్ వ్యవస్థ ఏర్పాటుకు సంబంధించిన పూర్వచరిత్ర. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో గల 10 జిల్లాలు 31 జిల్లాలుగా పునర్వవస్థీక రించబడినవి. 31 జిల్లాల ఏర్పాటులో భాగంగా కొన్ని జిల్లాలకు సంబంధించిన మండలాలు ఉదాహరణకు కరీంనగర్ జిల్లాలో గల నాలుగు మండలాలు మరియు వరంగల్ జిల్లాలో గల మూడు మండలాలు మెదక్ జిల్లాలోని సిద్దిపేట్ నూతన జిల్లా పరిధిలోనకి రావడం, ఇంకా కొన్ని పాత జిల్లా పరిధిలోని మండలాలు జోనల్ జిల్లాల పరిధిని అతిక్రమించి నూతన జిల్లాలో చేర్చినందున అమలులో గల జోనల్ వ్యవస్థను యధావిధిగా కొనసాగించుటకు న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యే పరిస్థితి ఏర్పడింది. దీనికి ప్రత్యామ్న్యాయ చర్యలుగా, అమలులో గల రెండు జోన్లను పునర్వ్యవస్థీకరించి, ఆరు జోన్లకు తక్కువ కాకుండా కొనసాగించవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది. ఇలా జరిగితేనే పాలన సౌలభ్యం కోసం చిన్న జిల్లాలు ఏర్పరచు సత్వర ప్రయోజనాల లక్ష్యం నెరవేరుతుంది. నియామకాలలో, పదోన్నతులలో అన్ని జిల్లాల ప్రాంతాలకు తగు న్యాయం జరుగుతుంది. ఇందుకు విరుద్దంగా ప్రభుత్వం మాత్రం ఏకపక్షంగా జోనల్ వ్యవస్థ రద్దుకే ఆలోచించి నిర్ణయం తీసుకోవడం సరైన విధానం కాదు. పాఠశాల విద్యారంగానికి సంబంధించి మూడంచెల వ్యవస్థ, జిల్లా స్థాయిలో DEO అజమాయిషీ క్రింద మధ్య స్థాయిలో RJD (ప్రాంతీయ విద్యా సంయుక్త సంచాలకుల) వ్యవస్థ కింద, రాష్ట్రస్థాయిలో పాఠశాల విద్యా సంచాలకుల నియంత్రణలో రాష్ట్రస్థాయి వ్యవస్థ నియంత్రించబడుతూ కొనసాగుతూ వస్తుంది. ఇందులోని ముఖ్యాంశములు:

1. జిల్లాస్థాయిలో యస్.జి.టి. స్కూల్ అసిస్టెంట్ క్యాడర్ స్థాయి పోస్టుల నియామకము, పదోన్నతులు కొనసాగుచున్నవి.
2. జోనల్ స్థాయిలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుల పోస్టులు, MEO పోస్టులు (మండల విద్యాధికారి పోస్టులు), ఉప విద్యాశాఖాధికారి పోస్టులు (Dy. EO), డైట్ లెక్చరర్ల పోస్టులు మరియు జూనియర్ కళాశాలల పోస్టులు జోనల్ పరిధిలో కొనసాగుతూ (నియామకాలు, పదోన్నతులకు సంబంధించి) వస్తున్నవి.
3. రాష్ట్రస్థాయిలో DEO తత్సమాన క్యాడర్ పోస్టులున్నవి.

## జోనల్ వ్యవస్థ రద్దు అయినచో తలెత్తే సమస్యలు

విద్యా నియంత్రణ పర్యవేక్షణకు సంబంధించిన RJD, Dy. EO పోస్టులు ఉండే అవకాశం ఉంటుందో లేదో చెప్పలేం. ఒకవేళ కొనసాగించదలచుకుంటే ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుల పోస్టులు, MEO పోస్టులు, పైన పేర్కొన్న RJD, Dy. EO పోస్టుల స్థాయి తగ్గించి జిల్లా స్థాయికి పరిమితం చేయడమే మార్గంగా ఉంటుంది తప్ప మరో దారి లేదు. విద్యా, విద్యేతర రంగాలకు సంబంధించి నియామకాలలో, పదోన్నతులలో రాష్ట్రమంతా ఒకే యూనిట్‌గా ఏర్పడి జోనల్ వ్యవస్థ రద్దుతో ఏర్పడి అందరూ ఒకే

స్థాయిలో పోటీని ఎదుర్కొనే అవకాశం ఏర్పడటం వల్ల ముందంజలో ఉన్న జిల్లాల అభ్యర్థులతో వెనుకబడిన జిల్లాల అభ్యర్థులు పోటీ పడి అవకాశాలు దక్కించుకోవడం సాధ్యపడదు. సమాన అవకాశాలకు ఇది విఘాతం కలిగిస్తుంది.

వ్యవసాయ రంగంలో, వెటర్నరీ, ఫారెస్ట్ విభాగాలలో గందరగోళ పరిస్థితులు ఏర్పడుతాయి మరియు కమర్షియల్ టాక్స్ విభాగానికి సంబంధించి, రెవిన్యూకు సంబంధించి మరియు మున్సిపల్ విభాగంలో రోడ్ రవాణా సంస్థ విభాగాలలో MPDO వ్యవస్థలో జోనల్ జిల్లా స్థాయి పోస్టులలో తీవ్ర గందరగోళం ఏర్పడి, అందరికీ అభివృద్ధి - అందుకు సమాన అవకాశాలు అనే సూత్రం ఎక్కడా కనపడదు.

ఎంతో దూరదృష్టితో, లోతైన అధ్యయనంతో, ఉన్న అవకాశాలు దెబ్బతినకుండా మరింత విస్తృతంగా అవకాశాలు విస్తరించ బడాలంటే, అన్ని రకాల నియామకాలు మరియు పదోన్నతులలో ఆయా జిల్లాలకు సమాన అవకాశాలు సమగ్రంగా లభించాలంటే ప్రభుత్వం తొందరపడకుండా అన్ని విభాగాల అధిపతులతో, విద్యావేత్తలతో, సంఘాల నాయకులతో, సామాజికవేత్తలతో, అన్ని రాజకీయ ప్రతినిధులతో విస్తృత సమావేశాలు నిర్వహించి జిల్లాల విభజన లక్ష్యం నెరవేరడానికి రాజ్యాంగబద్ధమయిన అభ్యంతరం ఆక్షేపణ లేకుండా జోనల్ వ్యవస్థపై ఆచి తూచి నిర్ణయం తీసుకోవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదన్న విషయం విస్మరించరాదు. జోనల్ వ్యవస్థ రద్దుపై ప్రభుత్వం పునరాలోచించాలని, జోనల్ వ్యవస్థను ఆరు జోన్లకు తగ్గకుండా పునర్వ్యవస్థీకరించి కొనసాగించాలనేదే STUTS దృఢమైన అభిప్రాయం *

## జాతీయ గణిత దినోత్సవం - డిసెంబర్ - 22




లెక్కల తరగతిలో ఉపాధ్యాయుడు పాఠం చెబుతున్నారు. ఒక సంఖ్యను అదే సంఖ్యతో భాగిస్తే '1' భాగఫలం వస్తుందని ఉపాధ్యాయుడు వివరిస్తున్నాడు. వెంటనే ఒక అబ్బాయి లేచి '0'ను '0'చే భాగిస్తే '1' వస్తుందా ? అని ప్రశ్నించాడు. ఆ ఉపాధ్యాయుడు ఆశ్చర్యపోయాడు. ఆ ప్రశ్నించిన బాలుడే శ్రీనివాస రామానుజన్. ఇతని పుట్టిన రోజునే "జాతీయ గణిత దినోత్సవం"గా జరుపుకుంటాము.

ఇతను తమిళనాడులోని ఈరోడ్ గ్రామంలో 1887 డిసెంబర్ 22న జన్మించాడు. చిన్నతనం నుండే గణితంలో మేధావిగా పేరు తెచ్చుకున్నాడు. తనకన్నా పెద్ద తరగతి విద్యార్థులకు గణిత పాఠాలు బోధించేవాడు. 13 సంవత్సరలా వయస్సులో త్రికోణమితిని అధ్యయనం చేయడమే కాక, కొత్త సూత్రాలను కూడా కనిపెట్టాడు.

ఒకసారి రామానుజన్ కనిపెట్టిన 120 సిద్ధాంతాలను కేంబ్రిడ్జ్‌లోని హార్డీ అను గణిత మేధావికి పంపాడు. ఆయన వాటిని చూసి ఆశ్చర్యపోయాడు. ఆయన రామానుజంను ఇంగ్లాండ్‌కు పిలిపించుకున్నాడు. అక్కడ రామానుజన్ రాయల్ సొసైటీ వారి ఫెలోషిప్ సాధించాడు. ఎన్నో గణిత సిద్ధాంతాలను ఆవిష్కరించారు. అయితే అక్కడి వాతావరణం సరిపోక క్షయవ్యాధికి గురై 33 సంవత్సరాల వయసులోనే మరణించాడు.

'1729'ని రామానుజన్ సంఖ్య అంటారు. రెండు అంకెల ఘనాల మొత్తంగా రెండు విధాలుగా చెప్పగలిగే సంఖ్యలలో 1729 అతి చిన్నది. $1729 = 1^3 + 12^3 = 9^3 + 10^3$ అన్నమాట*

